సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



ట్రెండింగ్‌లో నానో బనానా!
గూగుల్ జెమిని యాప్‌నకు నానో బనానాలో రూపొందిస్తున్న త్రీడీ చిత్రాలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. 8లో



16 నుంచి 'యాత్రాదానం'
దాతలసాయంతో అనాథలను యాత్రా దానం ద్వారా విహారయాత్రలకు తీసుకెళ్లను న్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆ తర్వాత కూడా ఆకాశంలో మేఘాలు అలుముకుంటాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారి అంతరాలయంలోని మూలమూ ర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభ వంగా నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామి వారిని పల్లకీసేవగా చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముగిసిన రామయ్య ఆభరణాల అప్పగింత

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచం ద్ర స్వామివారి ఆభరణాల అప్పగింత ప్రక్రియ శనివారంతో పూర్తయింది. భద్రాద్రి ఈఓగా పనిచేసిన ఎల్.రమాదేవి ఇటీవల వేముల వాడకు బదిలీపై వెళ్లారు. ఈఓల బదిలీల సమ యంలో నిర్వహించే స్వామివారి ఆభరణాలను అప్పగించే ప్రక్రియను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. రమాదేవి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈఓ దామోదర్‌రావుకు రామాలయానికి సంబంధించిన అన్ని రకాల ఆభరణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాల పూర్తి వివరాలను అప్పగించే ప్రక్రియ పూర్తి చేశారు.

ఎన్నికల కమిషనర్‌కు కలెక్టర్ స్వాగతం



ఎన్నికల కమిషనర్‌కు మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ ఐ.రాణి కుముదినికి శనివారం సింగ రేణి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో కలెక్టర్ జితేష్ వి.పా టిల్ మొక్కను అందజేసి స్వాగతం పలి కారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిప ల్లిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు పూజలు జరిపారు. పండితుల వేదమంత్రోచ్చర ణల నడుమ కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

16,17వ తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థు లు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. శాస్త్రీయ సం గీతం, జానపదం, వాద్య సంగీతం, శాస్త్రీయ నృత్యం, థియేటర్ ఆర్ట్, విజువల్ ఆర్ట్ 2డీ, 3డీ, కథలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వ హిస్తామని వివరించారు. గ్రూప్ పోటీల్లో గరిష్టంగా నలుగురు విద్యార్థులు, విజువల్ ఆర్ట్స్, కథల పోటీల్లో ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. పాత కొత్త గూడెం మార్వాడీ క్యాంప్‌లోని ఆనందఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సమన్వయకర్త గా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 14వ తేదీ లోపు నిర్దేశిత గూగుల్ షీట్లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పాఠశాల/కళాశాల ఐడెంటిటీ కార్డు తప్పనిస రిగా తీసుకురావాలని సూచించారు.

ఇన్‌స్పైర్‌కు ఏదీ సన్నద్ధత..?



జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- పరిశోధనాత్మక విద్యలో విద్యార్థుల వెనకబాటు
- ఎన్‌జీఎస్ పోటీల్లో జిల్లాకు చివరి స్థానం
- జూన్ నుంచి జిల్లా సైన్స్ అధికారి పోస్టు ఖాళీ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పరిశోధనాత్మక విద్యలో వెనుకబడుతు న్నారు. ఇన్‌స్పైర్, సైన్స్‌ఫేర్‌లకు విద్యార్థులను సన్న ద్ధం చేయాల్సిన జిల్లా సైన్స్ ఆఫీసర్ (డీఎస్‌ఓ) పోస్టును భర్తీ చేయడంలో విద్యాశాఖ అధికారులు జాప్యం చేస్తున్నారు. విద్యార్థి దశలోనే టెక్నాలజీ రంగంలో మొబైల్స్, ఇంటర్నెట్, మెడిసిన్, పర్యావ రణం, వాయు కాలుష్యం, జీవ వైవిధ్యం, పర్యావర ణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన పెంచు కోవాల్సి ఉంటుంది. నూతన ఆవిష్కరణలతో సైన్స్ పోటీల్లో పాల్గొంటే కొత్త విషయాలు నేర్చుకునే అవ కాశం కలుగుతుంది. ఇందుకు జిల్లా సైన్స్ ఆఫీసర్ దిశానిర్దేశం చేయాల్సి ఉంది. కానీ ఈ విద్యా సంవ త్సరం ప్రారంభం నుంచి జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టు ఖాళీగానే ఉంది. భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసి నా పైరవీలు ఎక్కువ కావడంతో నియామకాన్ని నిలిపివేశారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో జూన్ నుంచి సైన్స్ పోటీలు, అవగాహన కార్యక్రమాలపై పర్యవేక్షణ కొరవడిం ది. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో సైన్స్ యాక్టివిటీలు, క్విజ్ పోటీలు నిర్వహించగా, జిల్లా నుంచి కొద్ది మంది విద్యార్థులే పాల్గొన్నారు. వారు కూడా చివరి స్థానంలో నిలిచారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో సైన్స్‌ఫేర్ ఇన్‌స్పైర్ పోటీలు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తారు. ఆ పోటీలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, దర ఖాస్తులు చేయించాల్సి ఉంటుంది. పోటీల్లో పాల్గొనే లా విద్యార్థులను సిద్ధం చేయాలి. గతేడాది ఎంపికై న ఇన్‌స్పైర్ పోటీల్లో ఎంపికైన 113 ప్రాజెక్టులతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సైన్స్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం పాఠ శాలలో ఇవేమీ జరగడంలేదు.

ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో..

సైన్స్ ఆఫీసర్ పోస్టు భర్తీ కోసం గతంలో నోటిఫికేషన్ ఇవ్వగా ముగ్గురు ప్రధానోపా ధ్యాయులు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు దర ఖాస్తు చేసుకున్నారు. ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయడంతో ఫైల్‌ను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఈ విష యమై డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌తో చర్చించగా, త్వరలోనే డీఎస్‌ఓ పోస్టు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఇటీవల డీఈఓను కలిసి వినతిపత్రం కూడా ఇచ్చారు. ఇప్పటికైనా డీఈఓ స్పందించి సైన్స్ ఆఫీసర్ పోస్టును భర్తీ చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతు న్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశా ఖాధికారి నాగలక్ష్మిని ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటు లోకి రాలేదు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టులో శనివారం నిర్వహిం చిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభిం చింది. జిల్లావ్యాప్తంగా 11 కోర్టుల పరిధిలో దాదాపు గా 4576 కేసులు రాజీమార్గంలో పరిష్కారమయ్యా యి. కొత్తగూడెం కోర్టులో సివిల్ కేసులు 32, క్రిమి నల్ కేసులు 2,023, పీఎల్‌సీ కేసులు 278, మో టార్‌వాహన ప్రమాద కేసులు 24, మొత్తం 2,333 కేసులకు పరిష్కారం లభించింది. వాహన ప్రమాద కేసుల్లో రూ.1.82కోట్ల పరిహారం బాధితులకు లభిం చింది. ఇల్లెందు సివిల్ కేసులు 12, క్రిమినల్ కేసులు 363, పీఎల్‌సీ కేసులు 132, భద్రాచలంలో క్రిమినల్ కేసులు 1,106, పీఎల్‌సీ కేసులు 74, మణుగూరులో క్రిమినల్ కేసులు 489, పీఎల్‌సీ కేసులు 67 పరిష్కార మయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యా య మూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ పలు కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకున్నారని, కక్షిదారుల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. చిన్న తగాదాలను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకుని స్నేహ పూర్వక వాతావరణంలో ఉండాలని కక్షిదారులకు సూ చించారు. అదాలత్‌కు వచ్చిన కక్షిదారులకు ఎస్బీఐ ఆధ్వర్యంలో పులిహోర, తాగునీరు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యద ర్శి ఎం.రాజేందర్, న్యాయమూర్తులు కే.సాయిశ్రీ, బి. రవికుమార్, వినయ్‌కుమార్, పీవీడీ లక్ష్మి, గోపికృష్ణ, భాగం మాధవరావు, వి.పురుషోత్తమరావు, నిరంజన్ రావు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు, పోలీసు అధికారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం మీదుగా మరో ప్రత్యేక రైలు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం మీదుగా ఇప్ప టికే ఉన్న వారాంతపు రైలుకు తోడు మరో రైలును రైల్వే శాఖ ప్రకటించింది. నాందేడ్ - తిరుచానూర్ మధ్య ఈనెల 16, 23, 30 తేదీల్లో రైలు మొదలవుతుందని ఖమ్మం సీసీటీఓ రాజగోపాల్ తెలిపారు. తిరుగుప్ర యాణంలో ఈనెల 17, 24, వచ్చేనెల 1వ తేదీన ఉంటుందని వెల్లడించారు. ఈ రైలు తిరుచానూర్ వెళ్లేటప్పుడు నిర్ణీత తేదీల్లో అర్ధ రాత్రి 1–13 గంటలకు, నాందేడ్ వెళ్లే క్రమం లో తెల్లవారుజామున 3–45 గంటలకు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. దసరా, దీపావళి పండుగల వేళ స్వస్థలాలకు వెళ్లే వారి కోసం ఈ రైలు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎట్టకేలకు 'మత్స్య' టెండర్లు..

రేపు అదనపు కలెక్టర్ సమక్షంలో పరిశీలన



చేప పిల్లలు (ఫైల్)

పాల్వంచరూరల్: జిల్లాలో ఉచిత చేప పిల్లల(సీడ్) పంపిణీకి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. 2025–2026 సంవత్సరానికి టెండర్ ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసింది. మూడుసార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించినా ఒక్కరూ పాల్గొనలేదు. శుక్ర వారం చివరిసారిగా నిర్వహించిన ప్రక్రియలో నలుగురు టెండర్లు దాఖలు చేశారు. ఆంధ్రాకు చెం దిన ఇద్దరు, జిల్లా నుంచి మరో ఇద్దరు కాంట్రాక్టర్లు టెండర్లు దాఖలు చేశారు. ప్రక్రియ పూర్తిచేసి ఈ నెలాఖరులోగా జలాశయాల్లో చేప పిల్లలను విడు దల చేసేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

కోటి 20 లక్షల చేప పిల్లల పంపిణీ

ఈ ఏడాది జిల్లాలోని చెరువులు, కుంటలు, జలాశ యాల్లో కోటి 20 లక్షల చేపపిల్లలను పంపిణీ చేయాలని మత్స్యశాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 550 చెరువుల్లో చేప పిల్లలను పోయాలని ప్రణాళిక రూపొందించింది. ఈసారి చిన్న చెరువులు, కుం టల్లో చేప పిల్లల పెంపకం చేపట్టొద్దని మత్స్యశాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే చేపపిల్లలను చెరువు ల్లో పోసే సీజన్ ప్రారంభమైందని, పంపిణీ ప్రక్రి యను త్వరితగతిన పూర్తిచేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. కాగా గతేడాది కూడా ఆలస్యంగా, అది కూడా 86 లక్షల చేపపిల్లలను మాత్రమే పం పిణీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. జిల్లాలో చేపల పెంపకానికి 734 చెరువులు, కుం టలు ఉండగా, 70 మత్స్య పారిశ్రామిక సొసైటీలు ఉన్నాయి. ఇందులో 3,248 మంది సభ్యులు ఉన్నారు. 10 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఇక కిన్నెరసానిలోని మత్స్యశాఖ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో అధికారులు ముందుగానే గుడ్లను (స్పాన్) పోశారు. రెండు నెలలపాటు పెంచాక గిరిజన మత్స్యకార సొసైటీలకు 20 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు.

టెండర్లను రేపు పరిశీలిస్తాం



ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించ గా నలుగురు బిడ్లు దాఖలు చేశారు. ఫారాలను అదనపు కలెక్టర్ సమక్షంలో సోమ వారం పరిశీలిస్తాం. నిబంధ నల ప్రకారం ఉంటే మత్స్యశాఖ కమిషనర్‌కు పం పి, ఆమోదం పొందుతాం. తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు టెండర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. –ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి

'ప్రీ ప్రైమరీ'ని అంగన్‌వాడీల్లోనే కొనసాగించాలి

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



మాట్లాడుతున్న జయలక్ష్మి

చర్ల: ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా నాలుగో మహాసభ శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీ ఎస్ నిబంధనలకు విరుద్ధంగా ప్రీ ప్రైమరీ విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖలో విలీనం చేయడం సరికాదని అన్నారు. ఫేస్ క్యాప్చర్ యాప్ రద్దు చేసి, అంగన్‌వాడీ టీచర్లకు 5జీ మొబైల్ ఫోన్లను అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాం డ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా మంత్రుల ఇళ్ల ముందు ధర్నాలు చేయ నున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ, అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, ఉపాధ్యక్షురాలు పాయం రాధా కుమారి, నాయకులు ఎం.విజయశీల, శకుంతల, వీరభద్రమ్మ, స్వరూప, కళావతి, రాజ్యలక్ష్మి, కృష్ణ వేణి, భాను, జయసుధ కమలాదేవి గజలక్ష్మి, జానకి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు

ఎంఆర్‌ఐ అందుబాటులో లేక..



పాల్వంచ ప్రభుత్వాస్పత్రి

- అత్యవసర పరిస్థితుల్లో బాధితుల అవస్థలు
- కొత్తగూడెంలోని ప్రైవేట్ ల్యాబ్‌లో ఒకే ఒక్క మిషన్
- జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేయాలని విన్నపాలు

పాల్వంచ: రాష్ట్రంలోనే అతిపెద్ద, గిరిజన ప్రాంత మైన జిల్లాలో ఎంఆర్‌ఐ(మ్యాగ్నటిక్ రెజొనెన్స్ ఇమే జింగ్), ఎంఆర్‌ఏ(మ్యాగ్నటిక్ రెజొనెన్స్ యాం జియోగ్రఫీ) స్కానింగ్‌లు అందుబాటులో లేవు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందించే పరిస్థితి ఉండటంలేదు. ఎంఆర్‌ఐ కోసం ఖమ్మం వెళ్లాల్సివస్తోంది. దీనివల్ల భారీ ఖర్చు కూడా పెరు గుతోంది. ఒక్కో స్కానింగ్‌కు కనీసం రూ.5వేల నుంచి రూ.25 వేల వరకు ఖర్చవుతోంది. దీంతో బాధితులపై భారం పడుతోంది.

ప్రయత్నం చేస్తున్నాం



ఎంఆర్‌ఐ, ఎంఆర్‌ఏ స్కానింగ్ మిషన్లు లేక జిల్లా వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీని ఖరీదు ఎక్కువగా ఉండ టం వల్ల ప్రైవేటులో కూడా ఒకే మిషన్ అందుబాటులో ఉంది. అత్యవసర పరిస్థితు ల్లో ఖమ్మం వెళుతున్నారు. సమస్యను ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి ఎంఆర్‌ఐ స్కానింగ్ అందు బాటులోకి తెచ్చేలా ప్రయత్నం చేస్తాం. –డాక్టర్ రవిబాబు, డీసీహెచ్‌ఎస్

ప్రైవేటులోనూ ఒకే మిషన్

జిల్లా సుమారు 7,483 చదరపు కిలో మీటర్ల విస్తీ ర్ణంలో ఉండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 1,069,261 ఉంది. ప్రస్తుతం ఇంకా పెరిగింది. ఆంధ్రా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరి హద్దులుగా ఉండటంతో ప్రధాన రహదారులపై వాహన రాకపోకలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల శాతం కూడా అధికంగానే ఉంటోంది. తీవ్రంగా గాయపడినా, శరీరంలో అనారోగ్య సమస్య వచ్చినా ఎంఆర్‌ఐ, ఎంఆర్‌ఏ స్కానింగ్ రిపోర్ట్‌ల ఆధారంగానే వైద్యులు చికిత్స అందిస్తుంటారు. జిల్లావ్యాప్తంగా కేవలం కొత్త గూడెంలోనే ప్రైవేట్ లాబ్‌లో ఒకే ఒక్క మిషన్ అందుబాటులో ఉంది. జిల్లాలోని వైద్యులంతా స్కానింగ్ కోసం బాధితులను అక్కడికే పంపిస్తు న్నారు. మిషన్ ఖరీదు సుమారు రూ.6కోట్ల నుం చి రూ.7 కోట్ల వరకు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. కొందరు వైద్యులు కమీషన్ల కోసం ఎంఆర్‌ఐ, ఎంఆర్‌ఏ స్కానింగ్‌లు రాస్తు న్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఒకే మిషన్ ఉండటంతో నిర్వాహకులు కూడా అధిక మొత్తం ఫీజులు వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తు న్నారు. భారీఖర్చుతో కూడినది కావడంతో ఆర్థిక స్తోమత లేనివారు ఎంఆర్‌ఐ తీసుకోవడం ఇబ్బం దిగా మారింది. జిల్లా ప్రధానాస్పత్రిలో ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, బూర్గంపా డులలో సీహెచ్‌సీలు ఉండగా, కనీసం జిల్లా ప్రధానాస్పత్రిలోనైనా ఎంఆర్‌ఐ, ఎంఆర్‌ఏ స్కా నింగ్ మిషన్లను అందుబాటులోకి తీసుకురా వాలని ప్రజలు కోరుతున్నారు.

కుండపోత వర్షం.. పోటెత్తిన వరద

- దమ్మపేట, అశ్వారావుపేట, మణుగూరులలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి చేరిన వర్షపునీరు
- పలుచోట్ల రహదారులు మునిగి రాకపోకలకు అంతరాయం



దమ్మపేట : ప్రధాన రహదారిని ముంచెత్తిన వరద నీరు




మణుగూరు టౌన్: సురక్షా బస్టాండ్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట/మణుగూరు టౌన్: జిల్లాలో శనివారం పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. అశ్వారావుపేట, దమ్మపేట, మణుగూరు మండలాల్లో కుండపోత వాన పడింది. చెరువులు, నీటి కుంటలు నిండి వాగులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి, దుకాణాల్లోకి వరద నీరు చేరుకుంది. దమ్మపేట ప్రధాన రహదారిని వరద నీరు ముంచెత్తగా, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అశ్వారావుపేట మం డలంలోని మల్లాయిగూడెం గ్రామాన్ని వరద పోటె త్తింది. గ్రామంలోని ప్రధాన, అంతర్గత రోడ్లు జల మయంగా మారాయి. వాగొడ్డుగూడెం–అశ్వారావు పేట మార్గంలోని లోలెవల్ చప్టా మునిగిపోయింది. మద్దికొండ–కేశప్పగూడెం మధ్యలో వాగు ఉప్పొం గి ప్రవహిస్తోంది. అనంతారం, నారాయణపురం, ఖమ్మంపాడు ప్రాంతాల్లో పెదవాగు ఉధృతంగా ప్రహిస్తోంది. కుండపోత వర్షంతో కట్టువాగు, మొట్లవాగు ఉధృతంగా ప్రవహించగా మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో సురక్షా బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ వరద నీటి మళ్లింపు చర్యలు చేపట్టారు. సీఐ నాగబాబు, ఎస్‌ఐ రంజిత్ ట్రాఫిక్‌ను మళ్లించారు. సింగరేణి ఓసీ–4 గనిలో బొగ్గు, ఓబీ ఉత్పత్తికి అం తరాయం ఏర్పడిందని అధికారులు తెలిపారు.



అశ్వారావుపేటరూరల్: నారాయణపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు

కిన్నెరసాని నుంచి గోదావరిలోకి వరద నీరు



పాజెక్ట్ నుంచి దిగువకు వదులుతున్న వరదనీరు

పాల్వంచరూరల్: ఎగువన కురు స్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశ యానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటి నిల్వ సామ ర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 17,700 క్యూసెక్కు ల వరదనీరువస్తోంది. దీంతో శని వారం నీటిమట్టం 406 అడుగు లకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ మూడు గేట్లను ఎత్తి ఉంచి 15వేల క్యూసె క్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు డ్యామ్‌సైడ్ ఏఈ తెలిపారు.

ఫీజుల కోసం పోరుబాట

- రీయింబర్స్‌మెంట్ బకాయిలపై విద్యాసంస్థల నిర్ణయం
- రేపటి నుంచి రెండు రోజులు నిరసనలు

ఖమ్మం సహకారనగర్: పేద, మధ్య తరగతి విద్యా ర్థుల చదువుకు ఇబ్బంది లేకుండా వైఎస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారు. నాటి నుంచి ఎంద రో విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరారు. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెం ట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో తమపై భారం పడుతోందని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. మూడేళ్లుగా బకాయిలు విడుదల కాక విద్యాసంస్థల నిర్వహణ ఇబ్బందిగా మారిం దని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేక నిరసనలకు నిర్ణయించామ ని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కళాశాలలు వంద వరకు ఉండగా, రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక కళాశా లల నిర్వహణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వేతనాలు, అద్దె చెల్లింపులకు కష్టంగా మారిందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్యాచరణ

ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యాసంస్థల బాధ్యులు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శనివారం సమావేశమయ్యారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ తొలిదశలో ఈనెల 15న సోమవారం విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, యాజమాన్యాలతో ఖమ్మం అంబే ద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలుపుతామని, 16న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. వివిధ కాలేజీల బాధ్యులు చలసాని సాంబశివరావు, గుం డాల కృష్ణ, ఉషాకిరణ్, శ్రీధర్, కె. నవీన్‌బాబు, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిరిజన విద్యార్థికి ఆర్థికసాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదివి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ హిస్టరీలో సీటు సాధించిన పాయం కాంతారావుకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలం తాటివారిగూడెం గ్రామానికి చెందిన పాయం కాంతారావుకు ఐటీడీఏ ద్వారా ప్రోత్సాహకంగా రూ.30 వేలు అందించామని, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపకుండా నెలకు కొంత ఆర్థిక వెసులుబాటు చేసుకోవడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వర్క్ షాప్



వర్క్‌షాపునకు హాజరైన ప్రైవేట్ ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ బాధ్యులు

దమ్మపేట: మండలంలోని ప్రైవేట్ ఉపాధ్యాయులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దమ్మపేటలోని బోటనీ బాలాజీ ప్రైవేట్ స్కూల్‌లో ట్రైనింగ్ వర్క్ షాపును శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయన్స్‌క్లబ్ ప్రోగ్రామర్ కొండపల్లి రేణుక హాజరై మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనలో అనుసరించాల్సిన మెళకువలను వివరించారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు లక్కినేని నరేంద్ర బాబు, అంకత మహేశ్వరరావు, వేణు, కోటగిరి మోహన్‌రావు, సూర్యారావు, చలపతి, అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

ములకలపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సాయుధ తెలంగాణ పోరాట వారోత్సవాల సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత కమ్యూనిస్టు దిగ్గజం సీతారాం ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలోత్ రావూజా, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, పాయం అమల తదితరులు పాల్గొన్నారు.

జామాయిల్ చెట్లు నరికివేత



జామాయిల్ చెట్లను నరికి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కలప

టేకులపల్లి: సింగరేణి ఆధ్వర్యంలో టేకులపల్లి నుంచి పెట్రాంచెలక స్టేజీ వరకు పదేళ్ల క్రితం జామాయిల్ చెట్లను నాటారు. తుమ్మలచెలక స్టేజీలో కరెంటు తీగలకు అడ్డు వస్తున్నాయంటూ శుక్రవారం స్థానికులు కొందరు జామాయిల్ చెట్లను నరికివేశారు. ఆ కలపను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. రోజూ అదే మార్గంలో రాకపోకలు సాగించే సింగరేణి, ఫారెస్టు అధికారులు మాత్రం చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవడంలేదు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండల పరిధిలోని రామాంజనేయపురం గ్రామ శివారు సీతారామ ప్రాజెక్ట్ కాలువ సమీపంలో సుమారు పది జామాయిల్ చెట్లను శనివారం రాత్రి అక్రమంగా నరికివేశారు. కలపను ట్రాక్టర్‌లో తరలించేందుకు సమాయత్తమయ్యారు. స్థానికుల ద్వారా సమాచారంతో పరిశీలించేందుకు మీడియా వెళ్లగా గమనించిన అక్రమార్కులు ఉడాయించారు. ఈవిషయమై టీఎస్‌ఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ పీఎం సైదానాయక్‌ను వివరణ కోరగా.. దుంగలు, ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నామని, డిపోకు తరలిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని నాగిలిగొండకు చెందిన ఉచ్చర్ల కల్యాణ్(31) ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈనెల 11న పురుగుల మందు తాగాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు. కాగా, కల్యాణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రెండింగ్‌లో నానో బనానా!

- నెటిజన్లను ఆకట్టుకుంటున్న త్రీ డీ చిత్రాలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న ఫొటోలు

చుంచుపల్లి: కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో గూగుల్ రోజురోజుకూ సరికొత్త ఆలోచనలకు తెర లేపుతోంది. గూగుల్ జెమిని పేరుతో అత్యంత అడ్వాన్స్‌డ్ వెర్షన్ ఏఐ మోడల్‌ను విడుదల చేసింది. ఇది టెక్ట్స్, ఫొటో, ఆడియో, వీడియో, కోడింగ్ వంటి వివిధ రకాల సమాచారాన్ని 90 శాతం కచ్చితత్వంతో యూజర్లకు అందిస్తోంది. జెమిని 1.0 వెర్షన్‌ను ఇప్పటికే పలు వేరియంట్లలో తీసుకొచ్చారు. జెమిని అల్ట్రా, జెమినీ ప్రో, జెమిని నానో బనానా 3డీ ఏఐ వంటి డివైజ్‌ల వరకు అన్నింట్లో పనిచేస్తుంది. వీటి ద్వారా ఇప్పటికే పరిశోధనా పత్రాల్లో గ్రాఫ్‌లు, గణాంకాలను రూపొందిస్తున్నారు. విద్యార్థుల హోంవర్క్‌లోనూ జెమినీ టూల్స్ సాయపడుతున్నాయి. కాగా గూగుల్ జెమిని యాప్‌నకు నానో బనానా సంబంధించిన ఏఐ ఇమేజ్ నేర్ ఎడిటింగ్ టూల్స్‌ను తాజాగా విడుదల చేసింది. ఇందులోని నానో బనానా 3డీ ఫొటో ఎడిటింగ్ టూల్‌తో అదిరిపోయే త్రీడీ ఫొటోలను క్రియేట్ చేసుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు తమ త్రీడీ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ మురిసిపోతున్నారు. ఈ ఫొటోలకు నెటిజన్లను బాగా ఆకర్షితులవుతున్నారు.

క్షణాల్లో త్రీడీ ఫొటో..

ప్రస్తుతం నానో బనానా ట్రెండ్ నడుస్తోంది. సెకన్ల వ్యవధిలో అద్భుతమైన 3డీ ఫొటోలను క్రియేట్ చేసుకోవచ్చు. తొలుత గూగుల్ జెమిని వెబ్‌సైట్/యాప్‌ను ఓపెన్ చేయాలి. ఆ తర్వాత ట్రై నానో బనానా అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. అప్పుడు మీకు + అనే బటన్ కనిపిస్తుంది. దాని మీద క్లిక్ చేసి కావాల్సిన ఫొటోను అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత ఇంగ్లిష్‌లో క్రియేట్ ప్రాంప్ట్ ఇవ్వాలి. ప్రాంప్ట్ ప్రకారం 3డీ ఇమేజ్ సిద్ధమవుతుంది. ఆ ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకోవచ్చు. వినియోగదారులు తమ ఫొటోను అప్‌లోడ్ చేసి, బొమ్మల పెట్టె లోపల తమ బొమ్మను రూపొందించాలని జెమినిని అడగవచ్చు. ఇది ప్యాకేజింగ్, గ్రాఫిక్స్, స్టోర్-సెల్ఫ్ లుక్‌తో పూర్తి చేస్తుంది. ఈ విధానాన్ని చాలామంది ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ప్రాంప్ట్‌లలో ఇది ఒకటి. యాక్షన్ ఫిగర్, వేరే దశాబ్దంలో ఉన్నట్లు కూడా ఫొటోలను సృష్టించుకోవచ్చు. నచ్చిన ప్రముఖుల పక్కన ఉన్నట్లు కూడా ఫొటో క్రియేట్ చేసుకోవచ్చు. ప్రముఖ ప్రదేశాల్లో ఉన్నట్లు కూడా రూపొందిందించుకోవచ్చు. ఇప్పటివరకు 200 మిలియన్ల మంది జెమిని టూల్ ద్వారా 3డీ ఫోటోలు క్రియేట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు నచ్చిన ఫొటోలను రూపొందించుకుంటూ ఆనందపడుతున్నారు.



ఏఐ 3డీ ద్వారా రూపొందించిన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ చిత్రం



వైరల్ అవుతున్న సింగరేణి సీఎండీ బలరామ్ 3డీ ఫొటోలు

క్షణాల్లో కోరుకున్న ఫొటోలు

నానో బనానా 3డీ యాప్ చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. నేను కూడా అప్‌లోడ్ త్రీడీ చిత్రాలను రూపొందించుకున్నాను. సోషల్ మీడియా పోస్టు చేయడంతో బాగున్నాయని మిత్రులు అభినందించారు.

–చింతల చిరంజీవి, కొత్తగూడెం

ట్రెండింగ్‌గా మారాయి

ప్రస్తుతం జెమిని ఏఐ నానో బనానా 3డీ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతి ఒక్కరూ తమకు ఇష్టమైన ఫొటోలను రూపొందించుకుంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఈ 3డీ చిత్రాలు ఊపేస్తున్నాయి.

–మనోజ్‌కుమార్

ఈనెల 16 నుంచి 'యాత్రాదానం'

- దాతలు కోరుకున్న రోజుల్లో బస్సుల ఏర్పాటు
- ఆర్టీసీ రీజియన్ మేనేజర్ సరిరాం



ఖమ్మంమయూరిసెంటర్: ప్రత్యేక రోజుల్లోఅనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహారయాత్రలకు తీసుకెళ్లేలా టీజీఎస్ఆర్టీసీ 'యాత్రాదానం' పేరిట కార్యక్రమాన్ని రూపొందించిందని ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తాము కోరుకున్న రోజుల్లో పర్యటనకు తీసుకెళ్లేలా విరాళం అందజేయొచ్చని తెలిపారు. విరాళం ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు సమకూరుస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం సమీప ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలని ఆర్ఎం సూచించారు.

దూరం ఆధారంగా ప్యాకేజీల వారీ చార్జీల వివరాలు

దూరం (కి.మీల్లో.)	ఎక్స్‌ప్రెస్ (రూ.ల్లో)	డీలక్స్	సూపర్‌లగ్జరీ	రాజధాని
0–200	26,707	32,587	29,752	43,507
201–300	32,587	32,587	29,752	43,507
301–400	38,782	38,782	35,002	43,507
401–500	44,977	44,977	40,252	50,962

కేటీపీఎస్ సొసైటీ ప్రెసిడెంట్‌గా కేశులాల్

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నుకున్న డైరెక్టర్లు



సొసైటీ నూతన పాలక మండలి సభ్యులు

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ప్రెసిడెంట్‌గా నూనావత్ కేశులాల్ నాయక్, జనరల్ సెక్రటరీగా సిద్ది ప్రశాంత్, ట్రెజరర్‌గా వీరమల్లు రఘుకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా వల్లమల్ల ప్రకాష్‌లను ఎన్నుకున్నారు. నాలుగు పోస్టులకూ పోటీ ఏర్పడటంతో ఏకగ్రీవం చేసేందుకు తొలుత ప్రయత్నించారు. పోటీ అనివార్యం కావడంతో శనివారం ఉదయం ఎన్నికల అధికారి గంగాధర్, డీఎస్ఓ ఎ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించగా, నూతనంగా ఎన్నికైన 13 మంది డైరెక్టర్లు ఓట్లు వేశారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన నూనావత్ కేశులాల్ నాయక్‌కు 9 ఓట్లు, దానం నర్సింహారావుకు 4 ఓట్లు వచ్చాయి. సెక్రటరీ పదవికి పోటీ చేసిన సిద్ది ప్రశాంత్‌కు 10 ఓట్లు, డోలీ శ్రీనివాసరావు 3 ఓట్లు, ట్రెజరర్‌గా పోటీ చేసిన వీరమల్ల రఘుకృష్ణకు 9, బుద్దార్తి మహేందర్‌కు 4, వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన వల్లమల్ల ప్రకాష్‌కు 9, ధర్మరాజుల నాగేశ్వరరావుకు 4 ఓట్లు వచ్చాయి. అనంతరం నూతన అధ్యక్ష కార్యదర్శులు కేశులాల్ నాయక్, సిద్ది ప్రశాంత్‌లు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఖమ్మం.. సాహిత్య గుమ్మం

'నెనరు–నెమరు' సంపుటి ఆవిష్కరణలో వక్తలు

ఖమ్మంగాంధీచౌక్: ఆధునిక సాహిత్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం కేంద్రంగా నిలుస్తోందని కవి, విమర్శకులు, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. ఖమ్మం జెడ్పీ సమావేశ మందిరంలో కవి వంశీకృష్ణ తల్లి తాటికొండల భ్రమరాంబ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ఈ పురస్కారాన్ని నరసింహారెడ్డికి అందజేయగా ఆయన మాట్లాడారు. భక్త రామదాసు, ప్రముఖ భాషావేత్తలు నడియాడిన నేలపై సాహిత్య పురస్కారం అందుకోవడం తనకు ప్రత్యేకమని తెలిపారు. అనంతరం రచయిత్రి, అనువాదకురాలు స్వర్ణ కిలారి, కుటుంబీకులు రాసిన భ్రమరాంబ స్మృతి గీతాల సంపుటి 'నెనరు–నెమరు'ను ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, కవి, సంపాదకులు ఆనందాచారి మాట్లాడగా, కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు ప్రసేన్‌తో పాటు మువ్వా జయశ్రీ, వంశీకృష్ణ, సీతారాం, రవిమారుత్, ఇబ్రహీం, నిర్గుణ్, సుభాషిణి, నీలిమ, వీఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.



నరసింహారెడ్డిని సత్కరిస్తున్న కవులు, రచయితలు

రైతు ఆత్మహత్యపై కేసు నమోదు

ఇల్లెందురూరల్: యూరియా లభించకపోడంతో కుటుంబంలో జరిగిన వివాదానికి మనస్తాపంతో యువరైతు కున్సోత్ సుమన్ ఆత్మహత్య చేసుకోగా శనివారం ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రూ.500తో యూరియా కోసం విక్రయ కేంద్రానికి వెళ్లిన సుమన్ అక్కడ జరిగిన తోపులాటలో డబ్బులు పోగొట్టుకుని ఇంటికి చేరుకున్నాడు. యూరియా తేకపోవడంపై కుటుంబీకులు మందలించడంతో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై..

పాల్వంచరూరల్: వదినతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు పొలం దున్నకుండా అడ్డుకున్న మరిదిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామానికి చెందిన ఎనగండ్ల శంకర్‌బాబు ఇటీవల మృతి చెందాడు. అతని భార్య సుహాసిని ఈ నెల 7న పంటపొలం వద్దకు వెళ్లగా, అక్కడే ఉన్న ఆమె మరిది మహేష్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. పొలం దున్నడానికి వచ్చిన ట్రాక్టర్‌ను అడ్డుకుని గొడవపడి దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సొంతింటి పథకానికే కార్మికుల మొగ్గు

సీఐటీయూ నిర్వహించిన బ్యాలెట్ ఓటింగ్‌లో వెల్లడి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 11,12 తేదీల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించారు. శనివారం యూనియన్ బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో ఓటింగ్ నిర్వహించగా 2,575 మంది ఓటేశారని తెలిపారు. వారిలో 2,651 మంది సొంతింటి కోసమే ఓటువేశారని, 11 ఓట్లు క్వార్టర్లు కావాలని వేశారని, 3 ఓట్లు చెల్లలేదని వివరించారు. కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి బ్యాలెట్ ఓటింగ్‌కు ఆటంకం కల్పించేందుకు కుట్రలు పన్నారని, యాజమాన్యంతో కూడా ఆంక్షలు విధించిందని పేర్కొన్నారు. కార్మికుల అభిప్రాయం ప్రకారం యాజమాన్యం స్పందించి సొంతింటి పథకం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.రాజారావు, వై.వెంకటేశ్వర్లు, భూక్య రమేష్, లిక్కి బాలరాజు, గడల నరసింహారావు, లక్ష్మణరావు, ఎల్లగొండ రామ్మూర్తి, కార్తీక్, సామర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్యాలెట్ ఓట్ల వివరాలు వెల్లడిస్తున్న సీఐటీయూ నాయకులు

గౌతమీ నగర్‌లో చోరీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమినగర్ హెవీవాటర్ ప్లాంట్ కాలనీలో ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. కాలనీకి చెందిన భూక్య రమేష్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఎవరూ ఇంట్లోలేని సమయంలో దొంగ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని సుమారు పది తులాల బంగారు నగలు చోరీ చేశాడు. బాధితుల ఫిర్యాదుతో సీఐ అశోక్‌రెడ్డి, సిబ్బంది క్లూస్ టీంతో సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

కొణిజర్ల: అటవీ ప్రాంతంలో గుట్ట భూమిని తవ్వుతున్న ఓ ముఠాను అటవీ, పోలీస్ అధికారులు శనివారం అడ్డుకున్నారు. మండలంలోని తుమ్మలపల్లి బీట్ సౌత్ కంపార్ట్‌మెంట్ 49 లో రూ.కోట్ల విలువైన అటవీ భూమి ని కొందరు ఆక్రమించుకుని చెట్లు కొడు తూ మట్టి చదును చేస్తున్నారు. ఈ విషయమై అందిన సమాచారంతో అటవీ, పోలీస్ ఉద్యోగులు వెళ్లి జేసీబీని స్వాధీ నం చేసుకున్నారు. అయితే, మట్టి తవ్వకందారులు తిరి గి జేసీబీని లాక్కునే ప్రయత్నంచగా పోలీసులు వారిని అడ్డుకుని వాహనాన్ని ఖమ్మం తరలించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు వారిని అభినందించారు.

ఇసుక లారీ, జేసీబీ సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో అక్రమంగా ఇసుక నిల్వ చేశారు. అక్కడ నుంచి జేసీబీతో లారీలో ఇసుక నింపి ఇల్లెందుకు తరలిస్తుండగా శనివారం పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. మంచికంటి నగర్‌కు చెందిన ఊకే సతీష్, ఇల్లెందుకు చెందిన లారీ డ్రైవర్ భూక్య జానీ, జేసీబీ ఓనర్ పరుచూరి రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

ప్రైవేటు పాఠశాల ఎదుట మృతదేహంతో ధర్నా

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే రెండో తరగతి విద్యార్థి మృతి చెందాడని ఆరోపణ



లోకేష్ (ఫైల్)

భద్రాచలంటౌన్: యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే రెండో తరగతి విద్యార్థి మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం కుటుంబ సభ్యులు, కుల, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సరిహద్దు ఏపీలోని ఎటపాక గ్రామానికి చెందిన నాగమోహనాచారి-సరిత దంపతుల కుమారుడు లోకేష్ శనివారం పాఠశాలకు వచ్చి ఆడుకుంటూ కింద పడిపోయాడు. దీంతో పాఠశాల సిబ్బంది స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. సీఐ నాగరాజు పాఠశాలకు వద్దకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, కుల, విద్యార్థి సంఘాల నాయకులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మంగపేట: ములుగు జిల్లా సరిహద్దు గ్రామమైన బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు మీదుగా ఆటోలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని మంగపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా ఏటూరునాగారం శనివారం సీఐ అనుముల శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. బ్రాహ్మణపల్లి అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం ఏటూరునాగారం –బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ చేస్తుండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వైపు నుంచి వస్తున్న ఆటోలో గంజాయిని గుర్తించారు. ఆటోలో మణుగూరుకు చెందిన దుర్గాప్రసాద్, శ్రీనాథ్‌ను ఉండగా విచారించడంతో సతీష్, సాగర్, ఖలీమ్‌తో కలిసి సీలేరు నుంచి గంజాయి తీసుకొచ్చి మణుగూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. ఈక్రమంలోనే సతీష్, సాగర్ సూచన మేరకు రమణక్కపేటకు చెందిన శ్రీనుకు గంజాయిని తీసుకెళ్తూ పట్టుబడ్డారు. అయితే, ఆటో వెంట ద్విచక్ర వాహనంపై వస్తున్న ఖలీమ్ పారిపోగా, నిందితుల నుంచి రూ.90వేల విలువైన 1.820 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై టీవీఆర్.సూరి, సిబ్బంది చంద్రమోహన్, తాతారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పాల్వంచరూరల్: వివాహిత అదృశ్యంపై శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామానికి చెందిన అంబడి నాగప్రసన్న(సుబ్బన్న) ఈ నెల 11న వ్యవసాయ పనులకు వెళ్లాక భార్య ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైంది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

దుమ్ముగూడెంలో వ్యక్తి..

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన కామెడీ శ్రీను వారం రోజులుగా కనిపించడం లేదని బంధువులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజల కోసం పోరాడిన సురవరం

- సుధాకర్‌రెడ్డి మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు
- సంస్మరణ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజల కోసం పోరాడిన నికార్సయిన కమ్యూనిస్టు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన సురవరం సంస్మరణ సభ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించగా ఆయన చిత్రపటం వద్ద వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజాఉద్యమ గొంతుకగా సురవరం పనిచేశారని, ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే కాక పేద ప్రజలకు తీరని లోటన్నారు. కాగా, మతం, సైన్స్‌కు ప్రాంతీయ భేదం లేనట్లే కమ్యూనిజానికి సైతం ప్రాంతీయత లేదన్నారు. కమ్యూనిజం విడిపోయి బలహీనపడినా మళ్లీ ఐక్యతతో బలపడతామని తెలిపారు. అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడమే సుధాకర్‌రెడ్డి లాంటి అమరులకు ఇచ్చే నివాళి అని చెప్పొకారు. కాగా, వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాన్ని నేటి తరానికి వివరిస్తూ బలమైన ప్రజాఉద్యమ నిర్మాణాల కోసం డిసెంబర్ 26న ఖమ్మంలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పోరాటాలను నడిపిన సురవరం ఎందరికో ఆదర్శంగా నిలిచారని తెలిపారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బాగం హేమంతరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డాక్టర్ రవీంద్రనాథ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, నున్నా నాగేశ్వరరావు, మహ్మద్ మౌలానా, కె.రాంనారాయణ, ఆకుతోట ఆదినారాయణ, జమ్ముల జితేందర్‌రెడ్డి, స్వర్ణ భాస్కర్, రవిమారుత్, పోట్ల మాధవరావు, డాక్టర్ వై.ప్రసాద్, వడ్డె నారాయణరావు, యర్రా బాబు, జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణ కుమార్, క్లైమెంట్, మహ్మద్ సలాం, పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.